'ప్రత్యేక' పారిశుధ్యం ఏది?

మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

కొడిమ్యాల వివేకానందనగర్‌లో చెత్తా చెదారంతో మురుగు కాలువ

కొడిమ్యాల, ఫిబ్రవరి 10: మూడు రోజులుగా అధికారులు ఓ పక్క ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపడుతున్నారు. కానీ మరోపక్క డైనేజీల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. మురుగుకాలువలను శుభ్రం చేయడంలో అధికారుల చిత్తశుద్ధి కరువైంది. మండల కేంద్రంలోని ఏడో వార్డు వివేకానందనగర్‌లో మురుగు కాలువలు, రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసిన చెత్తతో నిండిపోయి కంపు కొడుతున్నాయి. దోమలు, ఈగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు రోగాల బారిన పడుతున్నారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయమై గ్రామ ప్రత్యేకాధికారి ప్రతాప్‌సింగ్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శికి చెప్పి సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తామని సమాధానం చెప్పారు.

కిడ్నాప్ కలకలం వట్టిదే

- కిడ్నాప్ యత్నానికి గురైన బాలుడు పొంతనలేని సమాధానాలు
- సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి ఉత్తదే అని తేల్చిన పోలీసులు

మల్యాల, ఫిబ్రవరి 10: మల్యాల మండలకేంద్రంలో కలకలం సృష్టించిన బాలుడి కిడ్నాప్ వ్యవహారం వట్టిదే అని తేల్చారు పోలీసులు. బాలుడిని తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లమని సూచించడంతో కిడ్నాప్ డ్రామా ఆడినట్లు విచారణలో నిర్ధారించారు. మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ కందుకూరి స్వామి వివరాల ప్రకారం.. షోయబ్ అనే బాలుడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా ఎక్కువగా ఇంటి వద్దనే గడుపుతున్నాడు. శనివారం షోయబ్‌ను తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లమని సూచించడంతో కిడ్నాప్ డ్రామా ఆడాడు. పాఠశాలకు వెళ్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసేందుకు యత్నించగా తప్పించుకొని వచ్చానని తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ క్రమంలోనే షోయబ్ చెప్పిన ఆనవాళ్ల ప్రకారం మల్యాల మండల పరిధిలో గల సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. షోయబ్ చెప్పే మాటల్లో పొంతన లేకపోవడంతో కిడ్నాప్ నాటకం ఉత్తదేనని తేల్చారు. మల్యాలలో ఎలాంటి కిడ్నాప్ ఘటన జరగలేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని పోలీసులు స్థానికులకు సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినట్లు కనబడితే పోలీస్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 100 కు ఫోన్ చేయాలని లేదా మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి 8712656818, ఎస్ఐ కందుకూరి కుమారస్వామి 8712573708కి సమాచారం చేరవేయాలన్నారు.

మల్యాల గ్రామపంచాయతీలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నారి ఆపరేషన్‌కు మాజీ ఎమ్మెల్యే సాయం

బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, ఫిబ్రవరి 10: మండలకేంద్రానికి చెందిన చిలువేరి నరేశ్-శరణ్య దంపతులకు నాలుగు నెలల పాప గుండెకు రంధ్రం రావడంతో ఆపరేషన్‌కు రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని హైదరాబాద్‌కు చెందిన వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా రూ.40వేల ఆర్థిక సాయాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మండలంలోని దమ్మయ్యపేట తాజీ మాజీ సర్పంచ్ తునిఖీ నర్సయ్య తల్లి ఆనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్ఆర్ఐలు, ఆర్థికవేత్తలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, సింగిల్ విండో చైర్మన్ మెన్నే ని రాజనర్సింగారావు, యూత్ మండలాధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు రాజు, చంద్రమోహన్, సంతోష్, సాగర్, చంద్రశేఖర్ ఉన్నారు.

పీవీ, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం

జగిత్యాల, ఫిబ్రవరి 10: తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న దక్కడంపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శనివారం మాజీ ప్రధాని పీవీ, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాథం, జిల్లా కార్యదర్శి గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 10: అయిలాపూర్‌లో శనివారం శ్రీహర్ష సాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ కోరుట్ల సహకారంతో ఆర్ఎంపీ, పీఎంపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నాగరాజు, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 200 మందికి పైగా రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పౌష్టికాహారం, పోషకాలు, వాతావరణ మార్పుతో సంభవించే వ్యాధులపై పిల్లలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో నాయకులు నందయ్య, గంగాధర్‌గౌడ్, అనంతస్వామి, రామగౌడ్, రాజనర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎంపీ, పీఎంపీలు రవి, రమేశ్, నరేశ్, రాజేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు భూ నిర్వాసితుల వినతి

బండి సంజయ్‌కి సమస్యను విన్నవిస్తున్న భూనిర్వాసిత రైతులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 10: 63వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు చేపట్టనున్న బైపాస్ రోడ్డు నిర్మాణంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, న్యాయం చేయాలని వెల్లుల్ల, మేడిపల్లి గ్రామాల భూ నిర్వాసిత రైతులు కోరారు. ఈమేరకు శనివారం కొండగట్టుకు వచ్చిన కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాలకు దూరంగా చేపట్టాల్సిన బైపాస్ రోడ్డును తమ విలువైన భూముల గుండా నిర్మించేందుకు అధికారులు సర్వే చేస్తున్నట్లు వాపోయారు. బైపాస్ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని, లేదంటే బహిరంగ మార్కెట్ ఆధారంగా తమకు నష్టపరిహారం చెల్లించేలా చూడాలని కోరారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి

సీఎంకు వినతిపత్రం ఇస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 10: ఉత్తర తెలంగాణలో ఎక్కువ మంది నిరుద్యోగ యువత గల్ఫ్ దేశాలపై ఆధారపడ్డారని, వారి సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఎన్ఆర్ఐ పాలసీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం శాసనసభ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. లక్ష ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందని, శంషాబాద్ విమానాశ్రయం నుంచి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఉచిత అంబులెన్స్ సేవలను అందించిందని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సంక్షేమ బోర్డు, గల్ఫ్ ఎన్ఆర్ఐల ఫిర్యాదుల పరిష్కారానికి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్‌కుమార్, ఇతర సభ్యులు ఇప్పటికే ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారన్నారు.

బోరు బావి ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి10: డబ్బా గ్రామంలోని మున్నురుకాపు సంఘం భవనంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి శనివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బోరుబావిని ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.1.35 లక్షలు వెచ్చించి బోరుబావిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ దేశెట్టి శాంత, నాయకులు రమేశ్, జీవన్, గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని నరేంద్ర జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ. విద్యార్థులకు ఇంటర్మీడియట్ అనేది ఉన్నత చదవుకు పునాది అని, పెడదోవ పట్టకుండా పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

12న టెండర్

ధర్మపురి, ఫిబ్రవరి 10: ధర్మపురిలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో కొబ్బరికాయలు, బెల్లం విక్రయానికి వేలం పాట నిర్వహించనున్నట్లు జాతర కార్యనిర్వహణాధికారి కిరణ్‌కుమార్, కమిటీ చైర్మన్ ఒల్లెపు శంకర్ రాజు తెలిపారు. ఈనెల 12న నిర్వహించే బహిరంగ వేలం పాటలో పాల్గొనే వారు రూ.2వేల నగదును డిపాజిట్ చేయాలన్నారు. వేలం పాట దక్కించుకున్నవారు ఈనెల 20 నుంచి 23వ రకు నాలుగు రోజుల పాటు కొబ్బరికాయలు విక్రయించుకోవచ్చన్నారు.

పెగడపల్లి ఎస్ఐగా రామకృష్ణ

పెగడపల్లి, ఫిబ్రవరి 10: పెగడపల్లి ఎస్ఐగా జాడి రామకృష్ణ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సీహెచ్. సతీశ్ గొల్లపల్లికి బదిలీ కాగా, ధర్మపురి-2 ఎస్ఐగా ఉన్న రామకృష్ణను పెగడపల్లికి బదిలీ చేశారు. ఎస్ఐ రామకృష్ణ సోమవారం విధుల్లో చేరనున్నారు.

భూమిపూజ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 10: జగ్గసాగర్, ఆత్మనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకాధికారులు రాజు, రాజ్‌మహ్మద్ శనివారం భూమిపూజ చేశారు. జగ్గసాగర్‌లో ఈజీఎస్ నిధులు రూ. మూడు లక్షలు, ఆత్మనగర్‌లో రూ. మూడు లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు.

మెట్‌పల్లి ఆర్డీవో బదిలీ

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మధు బదిలీ అయ్యారు. కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారిగా బదిలీ చేస్తూ ఆయన స్థానంలో మెట్‌పల్లి ఆర్డీవోగా రాజన్న సిరిసిల్ల జిల్లా పీఆర్ఆర్‌డీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మెట్‌పల్లి ఆర్డీవోగా శ్రీనివాస్ ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

'గృహజ్యోతి' వివరాల నమోదు

వెల్గటూర్/కోరుట్ల, ఫిబ్రవరి 10: ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఉచిత విద్యుత్ అమలుకు ఆ శాఖ అధికారులు ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. శనివారం వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో ఏఈఈ శ్రీనివాస్, లైన్‌మెన్ ఎనగందుల సంతోశ్, కోరుట్లలో వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, విద్యుత్ ఏఈ శ్యామ్ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడారు. లబ్ధిదారులు తమ వివరాలతో పాటు ప్రజాపాలన దరఖాస్తు నంబర్, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకై ఉన్న ఫోన్ నంబర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సైన్స్‌తోనే సుస్థిర భవిష్యత్తు

సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి

జగిత్యాల/కోరుట్ల, ఫిబ్రవరి 10: సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా శనివారం నలంద డిగ్రీ కాలేజీలో నాలుగు విభాగాల్లో పోటీలను నిర్వహించారు. పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీల్లో ఒక్కొక్క విభాగం నుంచి ముగ్గురు చొప్పున రాష్ట్రస్థాయికి 12 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది మంది న్యాయ నిర్ణేతలు, అడిషనల్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ రాజ్‌కుమార్ తదితరులు విజేతలను ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కి వైష్ణవి, హర్షిత

శ్రీచైతన్య హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం. వైష్ణవి 2024- నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో పాటల పోటీల విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. దీంతో విద్యార్థిని వైష్ణవిని పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ గంగారెడ్డి, ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, గైడ్ నర్సయ్య, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కోరుట్లలోని సిద్ధార్థ హైస్కూల్‌లో చదువుతున్న అల్లె హర్షిత పెయింటింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. హర్షితను పాఠశాల కరస్పాండెంట్ బాలాజీ దామోదర్, ఉపాధ్యాయులు అభినందించారు.

పలువురు తహసీల్దార్ల బదిలీలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 10: మల్టీ జోన్-1 పరిధిలో పలువురు తహసీల్దార్లను వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కమిషన్ మార్గదర్శకాల మేరకు బదిలీలు చేపట్టారు. జిల్లాలోని గొల్లపెల్లి తహసీల్దార్ ఆరీ పుద్దీన్‌ను పెద్దపల్లి జిల్లాకు, ఎండపెల్లి తహసీల్దార్ ఉదయక్ కుమార్‌ను కుమ్రం భీం ఆసిఫాబాద్‌కు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజమనోహర్‌రెడ్డిని మంచిర్యాలకు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయలక్ష్మీని నిర్మల్ జిల్లాకు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కరిమెరి తహసీల్దార్ ఎండీ జమీర్, మంచిర్యాల జిల్లా బీమారం తహసీల్దార్ విశ్వంభర్, నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, పెద్దపెల్లి కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజమణిని జగిత్యాల జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

జోన్-11లోని నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్లు ఖాజా అబ్దుల్ మజీద్, రాజశేఖర్, కార్తీక్ రెడ్డి, వినోద్‌కుమార్‌ను జగిత్యాల జిల్లాకు, జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, పెగడపెల్లి, బీర్‌పూర్ మండలాల నాయబ్ తహసీల్దార్లు హరీశ్‌కుమార్, వినయ్‌సాగర్, విష్ణువర్ధన్, పద్మను నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

పెగడపల్లి వర్తక సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ఎన్నికైన శ్రీ రాజరాజేశ్వరస్వామి వర్తక సంఘం

పెగడపల్లి, ఫిబ్రవరి 10: పెగడపల్లిలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి వర్తక సంఘం కార్యవర్గం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. వర్తక సంఘం అధ్యక్షుడిగా గంప వెంకటరమణ నాలుగోసారి ఎన్నికయ్యాడు. ఉపాధ్యక్షులుగా పెద్ది రమేశ్, కనపర్తి మనోహరాచారి, ప్రధాన కార్యదర్శిగా కొత్త భాస్కర్, కోశాధికారిగా మాసూరి పార్థసారథి, కార్యవర్గ సభ్యులుగా కొలిపాక సురేశ్, రామడుగు మధుచారి, కాటం తిరుపతిరెడ్డి, కొడిమెల తిరుపతి, విష్ణు, సుదర్శన్, పాదం కొమురయ్య, రవి, రాజేశం ఎన్నికయ్యారు.

సంగెంలో ఒకరిపై కత్తిపోట్లు

తాగునీటి పైప్‌లైన్ విషయమై ఘటన

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 10: మండలంలోని సంగెం గ్రామంలో ఒకరిపై కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఒడ్డెర కాలనీలో బావ బామ్మర్దులు ఒలెపు శ్రీనివాస్, సూర వెంకటి పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. తాగునీటి పైపులైన్ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సూరం వెంకటి, శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేశాడు. గమనించిన స్థానికులు తీవ్రగాయాలైన శ్రీనివాస్‌ను కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దారి అడిగి.. పుస్తెలతాడు చోరీ

పొలం పనులు చేస్తుండగా వేంపల్లిలో ఘటన

మల్లాపూర్, ఫిబ్రవరి 10: పొలం పనులు చేస్తున్న ఓ మహిళా రైతును ఇద్దరు వ్యక్తులు దారి అడిగారు. ఈ క్రమంలో ఆమె మెడలోంచి పుస్తెలతాడును లాక్కెళ్లారు. ఈ ఘటన మండలంలోని వేంపల్లి గ్రామంలో శనివారం జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహిళా రైతు సకినపల్లి రాజు శనివారం గ్రామ శివారులో వ్యవసాయ పనులు చేస్తున్నది. గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ద్విచక్రవాహనాన్ని ఆపి మహిళ వద్దకు వచ్చి రాయికల్‌కు వెళ్లే దారి అడిగారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించి ఆమె మెడలోంచి రెండు తులాల పుస్తెలతాడు అపహరించారు. బాధితురాలు రాజు స్థానికులకు సమాచారం అందించే లోపే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 10: అనారోగ్య కారణాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని ఓగులాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రొట్టె శ్రీధర్(26)కు ఎనిమిదేళ్ల క్రితం పెద్దపేగుకు ఇన్‌ఫెక్షన్ కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అయినప్పటికీ ప్రతినిత్యం తీసుకునే ఆహారం జీర్ణం కాకపోవడంతో తరుచుగా కడుపు నొప్పి వచ్చేది. ఎన్ని దవాఖానల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రుద్ర క్రిష్ణకుమార్ తెలిపారు..

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10: సోదరుడిని రక్షించబోయి ఈనెల 8న గల్లంతైన గణేశ్ ఇబ్రహీంపట్నం గ్రామశివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహమై తేలినట్లు ఏఎస్ఐ రామయ్య శనివారం తెలిపారు. పోలీసు కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన రోయ్యల గణేశ్(27) ఈనెల 8న తన సోదరుడు గౌతం అవసరాల నిమిత్తం తిమ్మాపూర్ గ్రామశివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కెనాల్‌లో పడిన గౌతంను రక్షించేందుకు వెళ్లిన గణేశ్ నీటి లో పడి కొట్టుకుపోయాడు. శనివారం ఉదయం ఇబ్రహీంపట్నంలో గణేశ్ మృతదేహం లభ్యమైనట్లు వారు వివరించారు. మృతుడి తల్లి గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాసవీమాతకు లక్ష పుష్పార్చన

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: పట్టణంలోని వాసవీ ఆలయంలో 28వ లక్షపుష్పార్చనను శనివారం ఘనంగా నిర్వహించారు. 102 వాసవీ ఆలయాల్లో లక్ష పుష్పార్చన నిర్వహించాలని హుల్దీపూర్ పీఠాధిపతి వామన ఆశ్రమ స్వామిజీ సంకల్పించారు. దీంతో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పాలతో అర్చన నిర్వహించినట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి మైలారపు లింబాద్రి తెలిపారు. లక్ష పుష్పారచనలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చాడ సురేశ్, కోట కిరణ్‌కుమార్, రవి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడి కుటుంబానికి సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న అయ్యప్ప సేవా సమితి సభ్యులు

వెల్గటూర్, ఫిబ్రవరి 10: మండలకేంద్రానికి చెందిన అయ్యప్ప భక్తుడు గట్ల లచ్చయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా వెల్గటూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో లచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.16వేలు, 50కిలోల బియ్యం లచ్చయ్య కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పెద్ది శ్రీనివాస్, తిప్పర్తి చంద్రమౌళి, మంచాల గోపాల్, సంకోజు నరేశ్, సంపత్, పెద్దూరి భరత్‌కుమార్, బోడకుంటి రమేశ్, బిడారి సతీశ్, గాలిపెల్లి మహేశ్, వైద్య వెంకటేశ్, పులి లక్ష్మణ్, గుంత సం తోశ్, పూర్ణసాయి, గోలి వంశి, తోగటి ప్రభాకర్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4 ఫలితాల్లో నలుగురికి ర్యాంకులు

కోయిలికారి కావ్య

ఆకుల దినేశ్

మైదం ప్రశాంత్

వేల్ముల మధుకర్

ధర్మపురి,ఫిబ్రవరి 10: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గ్రూప్-4 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కాగా గతేడాది జూలై 4న టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్ష నిర్వహించింది. శుక్రవారం రాత్రి ఫలితాలు వెల్డించింది. టీఎస్‌పీఎస్సీ మెరిట్ జాబితా విడుదల చేయగా ధర్మపురి మండలానికి చెందిన నలుగురు ర్యాంకులు సాధించి ఎంపిక యారు. ధర్మపురి మండలంలోని తుమ్మెనాలకు చెందిన వేల్ముల మధుకర్ రాష్ట్రస్థాయిలో 849వ ర్యాంకు, దమ్మన్నపేటకు చెందిన మైదం ప్రశాంత్‌కు 935(జిల్లా ర్యాంకు-30)వ ర్యాంకు సాధించారు. ధర్మపురి పట్టణానికి చెందిన ఆకుల దినేశ్‌కు రాష్ట్ర స్థాయిలో 1172వ ర్యాంకు, కోయిలికారి కావ్య రాష్ట్రస్థాయిలో 3712వ ర్యాంకు సాధించి. పలువురు వీరిని అభినందించారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 10: గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రాస్తున్న కుమ్మరిపెల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎంపీటీసీ దొంతి నాగరాజు శనివారం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. పాఠశాల మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఒల్లెపు రాజేందర్, పంచతి నరేశ్, పంచతి రాజు, వడ్లూరి రవీందర్, మహ్మద్ రఫి పాల్గొన్నారు.

ఐఎల్‌వో హక్కుల పుస్తకం బహూకరణ

జగిత్యాల, ఫిబ్రవరి 10: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ), ప్రవాస భారతీయుల విభాగం (ఎన్ఆర్ఐ సెల్), కువైట్ కో-కన్వీనర్‌గా ఇటీవల నియమితులైన కళ్యాణి చొప్పలను తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి శనివారం హైదరాబాద్‌లో అభినందించారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) వారు ప్రచురించిన వలస కార్మికుల హక్కుల పుస్తకాన్ని ఆమెకు బహూకరించారు.

12న గద్దర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ